క్లుప్తంగా

నీటి సమస్య లేకుండా చూడడమే లక్ష్యం..

గండేడ్: గ్రామాల్లో ఎక్కడ కూడా నీటి సమస్య లేకుండా చూడటమే ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్సూర్‌పల్లిలో నీటి సమస్య నెలకొనడంతో కొత్తగా ఎమ్మెల్యే నిధులతో నూతనంగా బోరు వేశారు. దీన్ని ఆయన ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి సంధ్య, బుగ్గయ్య, తిరిపతయ్య పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

జడ్చర్ల: వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పలు రోగాల బారిన పడుతున్నారని, వెంటనే సంబంధిత అధికారులు వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి, వైద్య చికిత్సలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ కోరారు. మంగళవారం తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, పీహెచ్‌సీ వైద్య అధికారిణి డాక్టర్ మనిప్రియకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, హవాజ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా రాజేష్

నవాబుపేట: మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో నిర్వహించనున్న వినాయక ఉత్సవ కమిటీ నియామక కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా రాజేష్, ఉపాధ్యక్షుడిగా తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా పుట్టి ఆంజనేయులు, కార్యదర్శులుగా మరికంటి నర్సింహ, కేశవులును ఎన్నుకున్నారు.

చెక్కుల పంపిణీ

రాజాపూర్: మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుష్యంత్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మశ్చందర్, కృష్ణయ్య, యాదయ్య, గోవర్ధన్‌రెడ్డి, మోటెసత్యం, విక్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండలంలోని కాటవరం, తండాకు చెందిన ఇద్దరికి కాంగ్రెస్ నాయకులు మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కాటవరం పెద్దచెరువు అలుగు పారుతుండటంతో పూజలు చేసి హారతి ఇచ్చారు. తోట శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, బనదీశ్వర్, దేవుజీ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మిడ్జిల్: మండల పరిధిలోని మర్లబావి తండా సమీపంలోని సర్వే నంబర్ 89, 90, 67 లోని ఎర్రకుంట, చెక్‌డ్యాంను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తండావాసులు మంగళవారం తహసీల్దార్ రాజునాయక్‌కు వినతి అందజేశారు. కుంటను, చెక్‌డ్యాంను ధ్వంసం చేయడంతో నీరు నిల్వ లేకుండా పోతుందని, భూగర్భ జలాలు తగ్గే ప్రమాదం ఉందన్నారు. రాజునాయక్, శ్రీను, శంకర్ ఉన్నారు.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

దేవరకద్ర రూరల్: స్విట్స్ కళాశాల ఆవరణలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాయ్స్ కళాశాల -2లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి గాను ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో మైనార్టీ-07, నాన్ మైనార్టీ-03, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో మైనార్టీ- 08, నాన్ మైనార్టీ -03 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 7వ తేదీ లోపు అర్హులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.

నీటి నిల్వ లేకుండా చర్యలు

మిడ్జిల్: మండల కేంద్రంలోని కేజీబీవీ, బోయిన్‌పల్లిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మంగళవారం జిల్లా మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. ఇటీవల కేజీబీవీలో వరద నీరు రావడంతో విద్యార్థినులకు ఇబ్బంది కలగడంతో జిల్లా ఉన్నత అధికారుల ఆదేశం మేరకు పరిశీలనకు వచ్చినట్లు తెలియజేశారు. పాఠశాల ఆవరణలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక క్రిస్టియన్‌పల్లి(ఆదర్శనగర్) లోని సర్వే నం.523లో ఇటీవల కూలగొట్టిన ఇళ్ల బాధితులకు మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాధితులకు న్యాయం జరిగేవరకు పార్టీ తరఫున అండగా ఉంటామని మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు తెలియజేశారు. శివరాజ్, గంజి వెంకన్న, గణేష్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, కిషన్‌పవార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలి

దేవరకద్ర రూరల్: అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పద్మజ సూచించారు. మంగళవారం పేరూర్ పరిధిలోని పీహెచ్‌సీ సెంటర్‌ను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నుంచి తీసుకుంటున్న చర్యలను డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ సర్వేలో గుర్తించిన వారికి రక్త పరీక్ష చేసి దాని ప్రకారం వైద్యసాయం అందించాలన్నారు. వైద్యులు రాధిక, రఘువరన్ పాల్గొన్నారు.

వైభవంగా నీలకంఠస్వామి ఊరేగింపు



నీలకంఠేశ్వర స్వామి ఊరేగింపులో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్



కోలాటం ఆడుతున్న మహిళలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం వీరన్నపేటలోని నీలకంఠస్వామి దేవాలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని గత నెల 5వ తేదీ నుంచి సోమవారం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పురవీధుల వెంట స్వామివారి పల్లకీసేవ ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో భజనలు, మహిళలు కోలాటం నిర్వహించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. డీకే ఆంజనేయులు, కౌన్సిలర్లు చెన్న వీరయ్య, అంజయ్య, రాములు పాల్గొన్నారు.

రంగనాయకస్వామి రథోత్సవం



వెంకటాయపల్లిలో స్వామి వారి రథోత్సవం



గుట్టపై స్వయంభుగా వెలిసిన రంగనాయక స్వామి

దేవరకద్ర రూరల్: వెంకటాయపల్లిలో స్వయంభుగా వెలిసిన శ్రీరంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జాతర ఉత్సవాలు మూడు రోజుల నుంచి ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ప్రధాన ఘట్టమైన స్వామివారి రథోత్సవాన్ని మంగళవారం ఆలయం నుంచి గ్రామరచ్చకట్ట వరకు వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కనుల పండువగా నిర్వహించారు.

వేప ఆకు తీయగా మారడం ప్రత్యేకత

కొన్ని తరాలుగా ఈ బ్రహ్మోత్సవ కార్యక్రమాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రావణ మాసంలో ఆలయంలో అఖండ దీపం వెలిగిస్తారు. నెల రోజులు గ్రామస్తులు మద్యం, మాంసాలకు దూరంగా ఉంటారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు జరిగే రథోత్సవ కార్యక్రమం గ్రామ రచ్చకట్ట వద్ద వేపచెట్టుకు రథం తాకగానే ఆకులు చేదుకు బదులు తీపిగా మారుతాయి. ఈ వేపాకులు తింటే సమస్త రోగాల నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. రథోత్సవానికి జిల్లా నుంచి కాకుండా హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పాల్గొన్నారు.

ముగిసిన హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు



వెన్నోని ఆంజనేయస్వామి

గండేడ్: ప్రతిఒక్కరూ సనాతన ధర్మం పాటించాలని, అప్పుడే జీవితానికి అర్థం పరమార్థం ఉంటుందని ముఖ్య అతిథి రామ్మోహన్‌స్వామి పేర్కొన్నారు. మంగళవారం గండేడ్ మండల పరిధిలోని వెన్నాచేడ్‌లో హనుమాన్ చాలీసా పారాయణం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అమావాస్య శ్రావణమాసం ముగియనుండడంతో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఉదయం 4.30 గంటల నుంచి అభిషేకంతో ప్రారంభమైన కార్యక్రమం మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగింది. అనంతరం 108 టెంకాయలు కొట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివమల్లప్ప, నారాయణరెడ్డి, గోపాల్, నరేందర్ రెడ్డి, జి.రాములు, సుభాష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



నవాబుపేటలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి పద్మ

నవాబుపేట: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పద్మ సూచించారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వసతులు పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సిజనల్ వ్యాధులపై జనం అప్రమత్తంగా ఉండాలని, దీనికి వైద్య సిబ్బంది ప్రజలు అందుబాటులో ఉండి, పలు సూచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, వ్యక్తిగత పరిశుభ్రత సైతం ప్రధానమని ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో ఉండే వైద్య సిబ్బంది ఇంటికి పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించాలని వివరించారు. వ్యాక్సినేషన్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట మండల వైద్య సిబ్బంది శరబలింగం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బాధితులను ఆదుకోవాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పంటలు నష్టపోయిన రైతులను, వరదల్లో చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు మొక్కజొన్న, వరి, పత్తి, మిరప పంటలు కోల్పోయారని, నీట మునిగిన వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టానికి ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కూలిపోయిన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాము, చాంద్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

పెద్దవాగుకు తగ్గిన వరద

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించిన పెద్దవాగుకు వరద తగ్గింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఎగువ నుంచి వరద రావడం తగ్గిపోయింది. ప్రస్తుతం పెద్దవాగులో ఉన్న చెక్‌డ్యాంలు నిండి కొంత మేర అలుగు పారుతున్నాయి. మరో వైపు రెండు మండలాల్లోని చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. అడ్డాకుల పెద్ద చెరువు, రాచాల, పొన్నకల్, చిన్నమునుగల్‌చేడ్, కాటవరం, గుడిబండ, మూసాపేట, నిజాలాపూర్, జానంపేట, వేముల చెరువులు అలుగు పారుతున్నాయి. ఆరుతడి పంటలకు ముసురు వర్షాలకు కొంత మేర నష్టం వాటిల్లిందని రైతులు తెలియజేశారు.

వరద నీరు వెళ్లేలా చర్యలు

- డ్రెయినేజీలో అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు వేసిన పైపుల తొలగింపు



డ్రెయినేజీలో వేసిన పైపులు తొలగిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వరుసగా కురిసిన భారీ వర్షాలకు రాయచూర్ రోడ్డులోని పెట్రోల్ పంపు సమీపంలో వరద నీరు నిలిచిపోయింది. దీంతో రెండు రోజులుగా పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు మంగళవారం అక్కడికి వెళ్లి ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా వేసిన సిమెంట్ పైపులను తొలగించారు. అనంతరం సమీపంలోని డ్రెయిన్‌లోకి వరద నీరు ఎక్కడ నిల్వకుండా ముందుకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురులింగం పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సేవలు మరువలేనివి



మహబూబ్‌నగర్ రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదాయాల్లో చెరగని ముద్ర వేశారని కోటకదిర సింగిల్ విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లు కృష్ణారెడ్డి వర్ధంతులను పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని మాచన్‌పల్లిలో వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ భగవాన్ శోభాయాత్ర

మహబూబ్‌నగర్ రూరల్: ఆచార్య ప్రబోధానంద యోగేశ్వరులకు మండల పరిధిలోని తెలుగుగూడెం, కోడూర్ తండాలో శ్రీకృష్ణ భగవాన్ శోభాయాత్రను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పత్రాలు లేని ట్రాక్టర్ స్వాధీనం

రాజాపూర్: మండల పరిధిలోని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం విధి నిర్వహణలో భాగంగా కానిస్టేబుల్స్ సుదర్శన్, శంకర్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. ముదిరెడ్డిపల్లి నుంచి రాజాపూర్ మధ్యలో ఒక ట్రాక్టర్ కృత్రిమ ఇసుక తయారు చేసేందుకు బిగించిన మోటార్‌తో వెళ్తుంది. వాటికి సంబంధించిన పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలియజేశారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కూలిన ఇళ్లు



రాజాపూర్: మండల కేంద్రానికి చెందిన భీమగళ్ల అంజమ్మకు చెందిన ఇల్లు మంగళవారం కూలిపోయింది. ఆ సమయంలో ఆమె ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అంజమ్మ ఇంటితో పాటు పక్కనే ఉన్న భీమగళ్ల రాములమ్మ ఇల్లు సైతం కూలిపోయింది. దీంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుష్యంత్‌రెడ్డి కూలిన ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి తగిన న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని అంజమ్మకు భరోసా ఇచ్చారు. ఆర్‌ఐ మంజుల, నాయకులు గోర్దన్‌రెడ్డి, విక్రంరెడ్డి ఉన్నారు.

ఉడిత్యాలలో..

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలంలోని ఉడిత్యాలలో మంగళవారం తెల్లవారుజామున యాదయ్య ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఇళ్ల పరిశీలన

దేవరకద్ర: మండల కేంద్రంలోని హరిజనవాడలో కూలిన ఇళ్లను మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధితులను పరామర్శించినట్లు తెలిపారు. దాసరి చంద్రమ్మ ఇంటి పైకప్పు పూర్తిగా కూలిపోవడంతో ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. రాజశేఖర్, రాంపాండు, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ప్లాంటు పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మండల పరిధిలోని మన్యంకొండలో మిషన్ భగీరథ పథకం నీటిశుద్ధి కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ ప్లాంటు పనిచేసే విధానాన్ని అక్కడి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. అందులోని ప్రతి హౌస్ వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఓబులాయపల్లిలోని రైతు వేదికను తనిఖీ చేశారు. వీలైనంత త్వరగా ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. అలాగే సర్వే నం.112లో రెవెన్యూ అధికారులతో కలిసి సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమాల్లో డీఈ వెంకట్‌రెడ్డి, ఏఈ మహేష్, రూరల్ మండల తహసీల్దార్ సుందర్‌రాజ్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెరువు కట్టలకు మరమ్మతు చేయాలి



చెరువు కట్టను విస్తరించాలని కలెక్టర్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

కోయిల్‌కొండ: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పాక్షికంగా దెబ్బతిన్న దమాయపల్లి గ్రామ గుండోని చెరువుకు తక్షణమే తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని కలెక్టర్ విజయేందిరబోయి నీటి పారుదల శాఖ పర్యవేక్షక ఇంజినీర్‌ను ఆదేశించారు. మంగళవారం దమయాపల్లిలోని గుండోని చెరువు, ఊరచెరువు, గణపతిరాయుడు చెరువులను ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయితీరాజ్‌శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పాక్షికంగా దెబ్బతిన్న చెరువు కట్టలకు వెంటనే మరమ్మతు చేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గణపతిరాయుడి చెరువు కట్ట పలు వంకర్లు తిరిగి ఉందని గ్రామస్తులు, రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్‌లో చెరువుకట్టకు ఇబ్బందులు కలుగకుండా చెరువుకట్టను విస్తరించేందుకు అంచనాలు అందజేయాలని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేందర్‌రెడ్డిని ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి మధుసూదన్‌గౌడ్, ఇరిగేషన్ ఎస్ఈ చక్రధర్, ఈఈ వెంకటయ్య, పంచాయతీరాజ్ ఈఈ నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ కాలప్ప, తహసీల్దార్ రాజాగణేష్ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు పరిశీలన



మిడ్జిల్‌లో ఓటరు లిస్టులో పేర్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

మిడ్జిల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డుల విభజన సందర్భంగా కొనసాగుతున్న ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు, మిడ్జిల్, బోయిన్‌పల్లి గ్రామాల్లో పరిశీలించారు. వార్డుల వారీగా విభజన త్వరగా పూర్తి చేయాలని సూచించారు. విభజనలో తప్పులు లేకుండా సరి చూసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈగల నుంచి రక్షించండి



కాకర్‌జాల్‌లో సమస్యలపై ఆరా తీస్తున్న ఎంపీడీఓ జయరాంనాయక్

నవాబుపేట: ఈగల నుంచి తమను రక్షించాలంటూ కాకర్‌జాల్ గ్రామస్తులు అధికారులకు వివరించారు. మంగళవారం మండల అధికారుల బృందం కాకర్‌జాల్, కాకర్‌జాల్‌తండాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని పౌల్ట్రీ కారణంగా తమ గ్రామంలో ఈగల బాధ ఎక్కువైందని వివరించారు. గ్రామంలో ఈగలు, దోమల నివారణకు చేపట్టే నివారణ కార్యక్రమాలు పౌల్ట్రీ యజమాన్యం సరిగ్గా చేయటం లేదని వివరించారు. ఈ విషయంలో ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకుంటామని మండల అధికారులు వివరించారు. గ్రామాలను పర్యటించిన వారిలో ఎంపీడీఓ జయరాంనాయక్, ఏపీఓ జ్యోతి తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నష్టపోయిన పంటపొలాలను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా నాయకులు

కోయిల్‌కొండ: కురుస్తున్న వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, జిల్లా సీనియర్ నాయకులు కిల్లెగోపాల్, నల్లవెల్లికురుమూర్తి, వరదగాలెన్న, బోయిని వెంకటయ్య అన్నారు. మంగళవారం మండలంలోని అభంగపట్నం, దమాయపల్లి గ్రామాల్లో వరదలకు నష్టపోయిన వరి పంటను పరిశీలించారు. అదేవిధంగా దెబ్బతిన చెరువు కట్టలకు మరమ్మతు చేయించాలని కోరారు.

ట్రాక్టర్‌పై విధులకు వెళ్లిన ఉపాధ్యాయులు



గంజివాగు దాటేందుకు ట్రాక్టర్ ఎక్కిన ఉపాధ్యాయులు

జడ్చర్ల టౌన్: మండలంలోని లింగంపేట సమీపంలో గంజివాగు ప్రవాహ ఉధృతి తగ్గకపోవటంతో మంగళవారం విధులకు వెళ్లాల్సిన ఉపాధ్యాయులు ట్రాక్టర్‌పై వెళ్లారు. గంజివాగు అవతల ఉన్న లింగంపేట, కోడ్గల్, పెద్ద ఆదిరాల, చిన్న ఆదిరాల గ్రామాల్లోని హైస్కూల్‌లు, ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయులు నిత్యం సొంత వాహనాలపై వెళ్తుంటారు. వాగు ప్రవాహం ఎక్కువగా ఉండటంతో రోడ్డుపై రాకపోకలు నిలిపివేశారు. దీంతో మంగళారం పాఠశాలలకు వెళ్లాల్సిన ఉపాధ్యాయులు వాగువద్దకు చేరుకుని తమ వాహనాలను అక్కడే నిలిపారు. కోడ్గల్ గ్రామస్తులు ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌లో ఉపాధ్యాయులంతా వాగు దాటారు.

డబ్బులు ఇప్పించండి



గతేదాది కట్టిన డీడీలను చూయిస్తూ.. మాట్లాడుతున్న కృష్ణయ్య తదితరులు

రాజాపూర్: టీఆర్‌ఎస్ హయాంలో కురుమ యాదవులకు గొర్లు ఇస్తామని పైసలు కట్టించుకుని గొర్లు ఇవ్వలేదని, కట్టిన డబ్బులు సంవత్సరం దాటినా వాపసు ఇవ్వడం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య ఆరోపించారు. మంగళవారం మండలంలోని రాయపల్లికి చెందిన కురుమయాదవులు ప్రభుత్వానికి కట్టిన డబ్బులు ఇప్పించాలని కోరారు. రెండోసారి టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతకూడా మరోసారి కురుమ యాదవులను మోసం చేసిందన్నారు. ఈ విషయం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి డబ్బులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కురుమ యాదవులు బుడ్డయ్య యాదవ్, బాలయ్య యాదవ్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి



ఏరియా ఆస్పత్రి నూతన కార్యవర్గం

జడ్చర్ల టౌన్: కార్మిక చట్టాలు కఠినంగా అమలు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం జడ్చర్ల ఏరియా ఆస్పత్రి బ్రాంచ్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్మిక చట్టాలు కాగితాలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ సంక్షేమం క్షేత్రస్థాయిలో అందాలంటే వాటిని కఠినంగా అమలు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చి దశాబ్దం గడుస్తున్నా.. అమలు చేయటంలేదన్నారు.

కార్యవర్గం ఎన్నిక..

జడ్చర్ల ఏరియా ఆస్పత్రి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా భాగికృష్ణయాదవ్, అధ్యక్షుడిగా నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా విజయలక్ష్మి, వర్కింగ్ ప్రసిడెంట్‌గా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మనెమ్మ, శివలీల, సహాయ కార్యదర్శులుగా భార్గవి, నవీన్, కోశాధికారి పద్మ, శేఖర్, కార్యవర్గ సభ్యులుగా రవి, అలివేల, చెన్నమ్మ, అలివేలమ్మ, కమిటీ సభ్యులుగా నీరజ, అంజమ్మ, యాదమ్మ, మంగమ్మ తదితరులు ఎన్నికయ్యారు.

ఘనంగా బోనాలు

దేవరకద్ర: మండలం బలుసుపల్లిలో మంగళవారం బోనాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి పోచమ్మ దేవాలయానికి బోనాలతో ఊరేగింపు బయలుదేరింది. ప్రత్యేకంగా అలంకరించిన బోనం కుండలతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు.

అంజన్నకు వెండిమాల సమర్పణ



దేవరకద్ర: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ బీసీ కాలనీలో ఇటీవల నిర్మించిన ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయానికి భక్తులు వెండి మాలను అందజేశారు. మంగళవారం బీసీ కాలనీకి చెందిన సంతోష్ భారతి దంపతులు స్వామివారికి ఆరు తులాల వెండి తమలపాకుల మాలను అందజేసి ప్రత్యేక పూజలు చేశారు.